# టాకింగ్‌డాల్

మంటలు... మంటలు... మంటలు... ఎర్రగా జ్వాలలు.. సూర్యుడు చంద్ర నిప్పులు కక్కుతున్నాడు... అడవులు తగలబడిపోతున్నాయి... ఊళ్ళు తగలబడిపోతున్నాయి... బాధాతప్త హృదయాలు తగులబడిపోతున్నాయి.

మృత్యువునే జయించాలని, మృత్యువాత దరిదాపులకు కూడా రాకూడదని అతనికి మృత్యుంజయుడని పేరు పెట్టింది వాళ్ళ అమ్మమ్మ. కాని నూనూగుమీసాల నూతన యవ్వనంలోకి అడుగు పెడుతున్న వయసులోనే మృత్యుంజయం మృత్యువునాహ్వానిస్తున్నాడు...

ఏ.సి.గదిలో ఫ్యానుకింద కూర్చున్న మృత్యుంజయం కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా, మంటల్లా వున్నాయి. అతని ముఖంనిండా చెమటలు, శరీరంనిండా చెమటలు. ఒళ్ళు చమటతో తడిసి ముద్దయింది. ఏడ్చి ఏడ్చి కళ్లవెంట చారికలు కట్టాయి. కడుపులో కడలిని మించిన కల్లోలం. దహించుకుపోతున్న హృదయం, గాయపడ్డ మనసుతో గదిలో కూర్చున్నాడు.

గదినిండా టేబుల్‌పై అలమారాలో మంచంలో చిందరవందరగా పుస్తకాలు. గది గోడలకున్నలయన్‌బొమ్మ భయంకరంగా నోరు తెరచి, పంజావిప్పి మీదికి దుముకుతున్నట్టుగా వుంది. మృత్యుంజయం చేతిలో ఎండ్రిన్ డబ్బా భీతావహంగా, వికృతంగా, మృత్యుదేవతలా వుంది.

డబ్బా మూతతీశాడు మృత్యుంజయం. అందులోని విషాన్ని చూశాడు. హృదయపు లో తుల్లోంచి పొంగుకొస్తున్న దుఃఖాన్ని, దుఃఖావేశాన్ని శోకప్రవాహాన్ని కప్పిపుచ్చుతూ మౌనిలా తనలోతానే నవ్వుకున్నాడు.

పోతున్నాడు. తాను పోతున్నాడు. ఎవ్వరూ అందుకోలేని సుదూర తీరాలకు చేరుకోబోతున్నాడు- తాను నాన్న మెచ్చే నో... నో... నాన్నను నాన్న అనొద్దు. డాడీ అనే పిలవాలి. తాను డాడీ కావాలనుకున్న పెద్ద ఇంజనీర్ కాబోతున్నాడు... త్వరలో నాలుగేళ్ల కాలమనవసరం లేదు. కొద్దినిమిషాల్లోనే.... డాడీ వాళ్లు అంకుల్ ఇంటి నుంచి తిరిగొచ్చేలోగానే తానో పెద్ద ఇంజనీర్ కాబోతున్నాడు.

డబ్బా మూతతీస్తూ పెడుతున్నాడు మృత్యుంజయం. డిసిప్లిన్... క్రూరమైన డిసిప్లిన్... చిన్న చిన్న పొరపాట్లకే స్నేహితులముందుముక్కు భూమికి రాయించే డాడీ డిసిప్లిన్‌ను తాను భరించలేడు. ఆ

ఆల్జెబ్రాతో తానుకుస్తీపట్టలేదు. కాలిక్యులస్‌తో తంటాలు పడలేదు. భౌతికశాస్త్ర సమస్యలతో యుద్ధం చేయలేదు. తానాయుద్ధం చేయలేడు... తాను చనిపోవాలి. తప్పదు... తాను చనిపోవాలి.

కాని ఒక్కసారి... ఒకే ఒక్కసారి... చివరిసారి తన కన్నీట్లో అండంగానిల్చిన, తన అవమానాల్లో, సంతోషాల్లో భాగస్వాములైన మిత్రుల్ని కలుసుకుంటే బావుండేది. కలుసుకొని కడుపు నిండా మాట్లాడితే తనకు తృప్తిగా వుండేది. కాని తన ప్రాణమిత్రుడు మహేందర్‌ను, ప్రియాతి ప్రియమిత్రుడు సుభాష్‌ను, ప్రాణానికి ప్రాణమైన జగన్‌ను, వేణుని, పోశెట్టిని తాను కల్సుకోలేకపోయాడు. తానిక మహేందర్ క్రికెట్ ఆట చూడలేడు. సుభాష్ ముద్దు ముద్దు మాటలు వినలేడు. వేణు జోకులు విని నవ్వలేడు. జగన్‌తో కలిసి తిరుగలేడు.

పోతున్నాడు. తానందర్నీ విడిచిపోతున్నాడు. తానీలోకం విడిచిపోతే మహేందర్ కుమిలి కుమిలి ఏడుస్తాడు. సుభాష్ ఆడవాళ్ల కంటె ఎక్కువగా భోరుభోరునేడుస్తాడు. వేణు తలకొట్టుకుంటూ దుఃఖిస్తాడు. జగన్ మొత్తుకుంటాడు. పోశెట్టి, సోమేశ్వర్, మహేశ్వర్ తన మిత్రులంతా తనెడబాటును భరించలేక శోకసముద్రంలో మునిగిపోతారు.

అయినా తప్పదు... తనకు చావు తప్పదు. క్రమశిక్షణ పేరుమీద జరిపే హింసను తాను భరించలేడు. తనకు ఇష్టంలేని చదువు తాను చదువలేడు. ఆ చదువులతో కుస్తీలు పట్టలేడు. డాడీ తననర్థం చేసుకోడు. తన అభిప్రాయాలకే మాత్రం విలువివ్వడు. తాను ఇంజనీరు కావాలన్నపట్టుదల వదలిపెట్టడు. డాడీకింత పట్టుదలెందుకో తనకసలే అర్థంకాదు. బతకడానికింజనీరే కావాలా? ఇంజనీర్ కాకుంటే తాను బతుకలేడా? తనకిష్టం లేకున్నా అదే చదవమని ఎందుకు బలవంతం చేయాలి? మాస్టారితోచెప్పించినా విన్లేదు డాడీ?

తనకు తండ్రిపై కోపంగా వుంది. కసిగా వుంది. తన చావుకు కారణమవుతున్న డాడీ తన శవాన్ని చూసి కుమిలి కుమిలి ఏడ్వాలినో... నో... డాడీ తన శవం దగ్గరికేరాకూడదు. తన శవాన్నే తాకడానికి వీల్లేదు. మరి అమ్మ...? ఈ కడుపుకోతను భరించకతప్పదు. డాడీని క్రూరంగా శిక్షించాలి. దారుణంగా శిక్షించాలి. తన్పై జరిగిన క్రూర నిర్బంధానికి పశ్చాత్తాపడేలా చేయాలి. మరెవ్వరికీ తనలాంటి స్థితి కలగకుండాచేయాలి. కాని తనకొక్కటే బాధ. ప్రాణానికిప్రాణాలైన మంచి మిత్రులకు దూరమవుతున్నాన్న బాధ... అయినా తనకు చావు తప్పదు.

జీవితాన్నంతం చేసుకోవడానికే నిర్ణయించుకున్న మృత్యుంజయం కళ్లముందు తండ్రిరూపం కదులుతోంది. చేతిలో యమపాశంతో తండ్రి వికటాట్టహాసం చేస్తున్నట్టగుపడుతున్నాడు. తండ్రినేమనలేని తల్లి కళ్లముందు మెదుల్తోంది. ఐ. ఐ. టి.లో ఇంజనీరింగ్ చేసి మంచి ఉద్యోగంలో వున్న అన్నయ్య కదుల్తున్నాడు. డాక్టర్ కోర్సు చదువుతున్న అక్కయ్య కళ్లముందుకొస్తోంది. తెల్ల మీసాలతో తాతయ్య, బోసినవ్వులతో అమ్మమ్మ అతని కళ్ళముందు సాక్షాత్కరిస్తున్నారు. మేనమామల అనురాగం, బావమరదుల ఆప్యాయత, మరదళ్ల పరాచికాలు సినిమారీళ్లలా కళ్లముందు తిరుగుతున్నాయి. ఊరిబయట చెట్లమధ్య వున్న అమ్మమ్మ ఊళ్ళోని పల్లెటూరి పాఠశాల, రణగొణధ్వనుల మధ్య వున్న పట్టణంలోని కాన్వెంటు పాఠశాల అతనికి జ్ఞాపకం వస్తున్నాయి.

డబ్బాపై మూతపెట్టి టేబుల్‌పై పెట్టాడు. మంచంలో వెల్లకిలా పడుకున్నాడు.

గతం... గతం... వర్తమానం... తీపి, చేదు అనుభవాలతో కూడుకున్నున్న గతం... గతంతో

ముడిపడున్న వర్తమానం... ఎమ్సెట్ పరీక్ష తండ్రి బలవంతం.. అతని కళ్లముందుకదులుతున్నాయి. మృత్యుంజయం మనోనేత్రాల్లో గతం గిర్రన తిరుగుతోంది.

★ ★ ★

రాఘవయ్య ఉన్నత పదవిలో ఉన్నరాష్ట్ర ప్రభుత్వోద్యోగి. ఆఫీసర్గా రెండుచేతులా ఆర్జిస్తున్నాడు. జిల్లా హెడ్క్వార్టర్లో అన్ని వసతులున్న పెద్ద ఇల్లుంది. రమేష్, మృత్యుంజయం అతని కొడుకులు, రూప కూతురు. తన పిల్లలు పెద్ద చదువులుచదివి ఉన్నత పదవుల్లో వుండాలని అతని ఆకాంక్ష అందుకోసం ఇంట్లో క్రమశిక్షణ పేరుతో క్రూరమైననిర్బంధాన్నమలు చేస్తాడు. రమేష్, రూప అతని కనుగుణంగా మెదులుతున్నారు.

మృత్యుంజయంకు అమ్మమ్మ ఊరంటే ఇష్టం. ఆ పల్లెటూరంటే ఎనలేని ప్రేమ. తననెంతో ప్రేమగా చూసుకునే అమ్మమ్మన్నా, తాతయ్యన్నా, మామయ్యలన్నా చాలా ఇష్టం. పచ్చని పొలాలతో, చెట్టుచేమలతోకూడుకొనున్న మామయ్యల ఊరన్నా పాడిపంటలతో పచ్చగా వుండే అమ్మమ్మ ఇల్లన్నా ఆ పసివాడికి తీరని అభిమానం. బావమరదులతో ఆ పల్లెలో తిరగడం. మరదళ్లతో ఆడుకోవడం అతనికెంతో ఇష్టం. ప్రతి సంవత్సరం కొద్దిరోజులు అమ్మతో ఆ ఊరెళ్లే మృత్యుంజయం ఆ ఊరుపై అనురాగాన్ని పెంచుకున్నాడు. అమ్మమ్మ చెప్పేకథలు, చందమామ రావే, చేతవెన్న ముద్ద, పిల్లా పేరు మల్లెమొగ్గ నా పేరు తాసీల్దారు లాంటి పాటలంటే అతను చెవికోసుకుంటాడు. అందుకోసం అతన్ని బళ్లో వేస్తానన్నప్పుడు అమ్మమ్మ ఊళ్లోనే చదువుకుంటానన్నాడు మృత్యుంజయం. ఆ మాటలు విని గుడ్లురిమి చూశాడు రాఘవయ్య.

''పల్లెటూరు చదువులేం చదువుర్రా? శుభ్రంగా పట్నంలో ఇంగ్లీషు మీడియంలో చేర్పిస్తాను'' అన్నాడు రాఘవయ్య. పల్లెటూళ్లోనే చదువుకుంటానని మృత్యుంజయం ఏడ్చినా విన్లేదు. తండ్రిభయానికి కాన్వెంట్లో చేరక తప్పలేదతనికి. కాన్వెంట్లో చెప్పే బాబా బ్లాక్షీప్ లాంటి పాటలకంటె అమ్మమ్మ ఊళ్ళోని పాటలు అతనికి హాయనిపించేవి.

తండ్రి భయానికి కాన్వెంట్లో చేరినా మృత్యుంజయంకు అమ్మమ్మ ఊరిపై ప్రేమ పోలేదు. ప్రతిసారి సెలవులకు ఆ ఊరెళ్లేవాడు. మట్టిలో తిరగొద్దని, ఆడొద్దని, పరిశుభ్రంగా ఉండాలని ఎన్నో ఆదేశాలిచ్చి ఊరు పంపేవాడు తండ్రి. మట్టిలో ఎగిరినట్టు తెలిస్తే ఒళ్లు చీరేస్తానని బెదిరించేవాడు. అతనికి పల్లెటూరు చెరువు గట్లవెంట పరుగెత్తడం, చెట్లెక్కడం, అందరితో కలిసి ఆడుకోవడం ఇష్టం. పట్టణంలోనిలతనింట్లో రోజూ తినే ఇడ్లీ దోశెల కంటెపల్లెటూళ్లో కందికాయ, పెసరకాయ, పచ్చిపల్లీకాయ లాటివాటినే ఇష్టపడేవాడు. మట్టిలో ఆడడంలాంటి అతని అభిరుచులు అనాగరికమైవిగా మృత్యుంజయం తండ్రి భావించి తిట్టేవాడు. మృత్యుంజయంకు చిర్రగోనె, బొంగరాలాట, కబడ్డీ లాంటి అన్ని ఆటలు ఆడుకోవాలనుండేది. కాని అతని తండ్రి క్రికెట్, హాకీ, ఫుట్బాల్లాంటి ఆటలను మాత్రమే ఆడుకోవడానికి ప్రోత్సహించేవాడు. క్రమశిక్షణ పేరుమద, చదువు పేరుమీద మృత్యుంజయం తండ్రి ఎన్నో ఆదేశాలు జారీచేశాడు. మృత్యుంజయంకు అందరితో స్నేహం చేయాలని, కలిసి తిరగాలని, కలుపుగోలుగా వుండాలనుంటుంది. కాని అతని తండ్రి ఖరీదైనమనుషులతో తప్ప స్నేహంచేయడానికొప్పుకోడు. డిప్యూటీ కలెక్టర్గారబ్బాయి లాంటివాళ్లతోనే మిత్రత్వాన్ని ప్రోత్సహిస్తాడు. తన అభిప్రాయాలకు భిన్నంగా ప్రవర్తించిన కొడుకునెన్నో సార్లు కొట్టాడు... తిట్టాడు. ఎన్నోసార్లు మృత్యుంజయం అమ్మమ్మ ఊరికి పారిపోయాడు.

అమ్మా... నాన్నా అని కాకుండా మమ్మీ డాడీ అని పిలువాలని కొడుకు నాదేశించాడు. మృత్యుంజయం కోర్కెలకు భిన్నంగా అతని అభిప్రాయాలకే మాత్రం విలువివ్వకుండా మిలిట్రీ క్రమశిక్షణతో, చదువు తప్ప వేరే విషయాల గూర్చి ఆలోచించవద్దని చెబుతూ పెంచుతున్నాడు రాఘవయ్య. ఆ పసివాడికి తండ్రితో స్వేచ్ఛగా మాట్లాడాలంటేనే భయం. తనకిష్టం కాని విషయాల గూర్చి చెప్పాలంటేనే వణుకు.

మృత్యుంజయం ఇప్పుడు హైస్కూలుచదువులో ప్రవేశించాడు. హైస్కూలుకు రాగానే కొడుక్కు ఎమ్‌సెట్ గురించి, ఐ. ఐ. టి గురించి చెప్పాడు రాఘవయ్య. ఎలాగైనా చేసి ఇంజనీర్ కావాలన్నాడు. అందుకోసం ఎంతైనా ఖర్చు పెడతానన్నాడు. ఏ కోచింగ్‌కైనా పంపిస్తానన్నాడు. కాని మృత్యుంజయంకు ఇంజనీర్ కావాలని లేదు. అతడు సహజంగా ఇంటిలిజెంటే అయినా ఆ చదువుపై ఇష్టంలేదు. అతనికి లిటరేచరంటే ఇష్టం. హిస్టరీ అంటే ఇష్టం. కొంత కొంత స్వతంత్రాభిప్రాయాలను సంతరించుకున్న మృత్యుంజయంకు తండ్రితో ఘర్షణ తప్పడం లేదు. తిట్లు, దెబ్బలూ, అవమానాలూ తప్పడంలేదు. కొడుకును పుస్తకాల పురుగుగా మార్చి ఇంజనీర్‌చేయాలని రాఘవయ్య ప్రయత్నం. కాని మృత్యుంజయం అప్పుడప్పుడు తండ్రి అభిప్రాయాలకు భిన్నంగా ప్రవర్తించడంతో ఇద్దరి మధ్య ఘర్షణలొస్తున్నాయి. కొడుకు చదువుకు భంగం కలుగుతుందని ఇంటికొచ్చిన మృత్యుంజయం మిత్రులను తిట్టిపంపించాడెన్నోసార్లు రాఘవయ్య.

మృత్యుంజయం పదవ తరగతి పూర్తిచేసే సరికి రాఘవయ్య పెద్దకొడుకు ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించుకున్నాడు కూతురు రూప ఎమ్. బి. బి. యస్. చదువుతుంది. చిన్నకొడుకును కూడా ఇంజనీర్ చేయడం అతని టార్గెట్. కొడుకును ఇంజనీర్ చెయ్యాలన్న పట్టుదల రాఘవయ్యలో రోజురోజుకూ పెరుగుతుంటే అందుకు భిన్నంగా మృత్యుంజయంలో దానిపై వ్యతిరేకత పెరుగుతోంది. మృత్యుంజయం అన్న, అక్కల చదువుల గూర్చి కొడుకుతో చెప్పాడు రాఘవయ్య. అందరు మంచి స్థితిలో వున్నప్పుడు తానుకూడా పై చదువులు చదవాలనికొడుక్కు బోధించాడు. భవిష్యత్తులో లభించే ఉద్యోగాల గూర్చి వివరించాడు. ప్రొఫెషనల్‌కోర్సెస్ చదువనివాళ్లు పడుతున్న ఇబ్బందుల గూర్చి చెప్పాడు. మృత్యుంజయంకు ఇష్టం లేకున్నా ఇంటర్ ( ఎమ్. పి. సి. ) లో చేర్పించాడు. రాంక్‌లో పాస్ కావాలని ఆజ్ఞ జారీచేశాడు. అందుకోసం ట్యూషన్ పెట్టించాడు. ఇంట్లో ఉన్నప్పుడు దగ్గరుండి చదివించాడు. తనకీ చదువొద్దని మృత్యుంజయంకు అరవాలని వుంది. తండ్రితో చెప్పాలనుంది. కానీ చెప్పలేకపోయాడు. చెప్పినా తండ్రి వినడని తెలుసు.

మాథమాటిక్స్‌తో, కెమిస్ట్రీ ఈక్వేషన్‌తో, ఫిజిక్స్ ప్రాబ్లమ్స్‌తో కుస్తీపట్టడం ఇష్టం లేకున్నా తండ్రికోసం చదువుతున్నాడు. మృత్యుంజయం. ఎలాగైనా ఇంటర్ పూర్తిచేసి లిటరేచర్‌లో డిగ్రీ, పి. జి. చేసి లెక్చరర్ కావాలని, అటు తర్వాత డాక్టరేట్ కూడా చెయ్యాలని అతని అభిలాష. ఇంటర్ తర్వాత తండ్రి నెదిరించైనాసరే తాననుకున్నదే చదవాలనుకున్నాడు. రాత్రింబవళ్లు పుస్తకాలకే అంకితమయ్యాడు. ఇంటర్ పరీక్షలు రాశాడు. ఏదో రాంకు వస్తుందన్న నమ్మకముంది మృత్యుంజయంకు. పరీక్షలుకాగానే ఎమ్‌సెట్ కోచింగ్‌కు సిటీకి పంపిస్తానన్నాడు. మృత్యుంజయం పోనన్నా తండ్రి విన్లేదు. ఎమ్‌సెట్‌కు పోనన్న కొడుకును రాఘవయ్య తిట్టాడు. కొట్టాడు. అమ్మమ్మ ఊరికి పారిపోతే తీసుకొచ్చాడు. సిటీకి పంపించడానికి తయారు చేస్తున్నాడు రాఘవయ్య. కాని మృత్యుంజయం కది ఇష్టంలేదు. తనకు ప్రీతి పాత్రుడయిన వెంకట్రావు మాస్టారు దగ్గరికెళ్లాడు. మొదట్నుంచీ తన అభిప్రాయాలకు భిన్నంగా ఎలా చదవాల్సి వస్తోందో వివరించాడు.

తండ్రితో మాట్లాడమని వేడుకున్నాడు.

''మీ నాన్న నేను చెబితే వింటాడనుకోను. అయినా ప్రయత్నిద్దాం..' అన్నాడు వెంకట్రావు మాస్టారు. ఇద్దరు కలిసి రాఘవయ్య ఇంటి కెళ్లారు. మాస్టారును తండ్రికి పరిచయం చేశాడు మృత్యుంజయం.

''మీవాడు మంచి ఇంటలిజెంట్. అందులో సందేహం లేదు. మీరు తండ్రిగా వాడు ఇంజనీర్‌కావాలని కోరుకోవడంలో తప్పులేదు. కాని, వాడికది చదవడం ఇష్టంలేదు'' ఉపోద్ఘాతంలాంటిదేం లేకుండానే సూటిగానే చెప్పాడు వెంకటావు.

''పిల్లలదేంటండీ..? వాళ్లకేం కావాలో వాళ్లకే తెలియదు. వాడు ఇంటజలిజెంట్‌కాబట్టితప్పకుండా ఇంజనీరవుతాడని నా నమ్మకం''

''పిల్లలయినా వాళ్లకూ కొన్నభిప్రాయాలుంటాయి. పెద్దలమైనమనం మన అభిప్రాయాలను వాళ్లపై బలవంతంగా రుద్దకూడదు. వాళ్ల అభిరుచులను తెలుసుకొని పెద్దలుగా మనం మార్గం చూపెడితే బాగుంటుంది. కాని బలవంతంగా ఇదే చదవాలని శాసించడం బాగుండదు. నాకు తెలిసిన ఓ మిత్రుడున్నాడు. అతని కూతురు మంచి ఇంటలిజెంట్. టెన్త్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయింది. వాడికెవరు చెప్పారో ఏమో ఇంటర్‌లో ఇంగ్లీషు మీడియంలో జాయిన్ చేస్తానన్నాడు. నేనెంత చెప్పినా వినలేదు. పరీక్ష రాస్తున్న అమ్మాయి దగ్గరకు నేను వెళ్లాను. ఆమె కనుగుడ్ల నిండా నీళ్లు. ఏంటమ్మా అని అడిగాను. 'సార్... నాకన్ని ప్రశ్నలకు జవాబులు తెలుసు. కాని రాయలేకపోతున్నాను' అంది. చివరకా అమ్మాయి ఇంటర్‌లో ఫెయిలయింది. ఆమె తండ్రి నాకుతర్వాత ముఖం కూడా చూపించలేదు. ఇంగ్లీషు మీడియం చదువులు వద్దని నేనడంలేదు. కాని మాతృభాషలో బోధనవల్ల పిల్లలు మరిన్ని విషయాలెక్కువగా తెలుసుకునే అవకాశముంది'' అన్నాడు వెంకట్రావు.

''మా వాడికా ప్రాబ్లం లేదులెండి... వాడు మొదట్నుంచీ కాన్వెంట్‌లోనే చదువుతున్నాడు'' అన్నాడు రాఘవయ్య.

''మీ వాడికి భాష విషయంలో సమస్య ఉందని చెప్పడంలేదు. జెనరల్ విషయం చెబుతున్నాను. తల్లిదండ్రులు పిల్లల చదువు విషయంలో శ్రద్ధ తీసుకోవడంలో తప్పులేదు. తీసుకోవడం బాధ్యత కూడా. కాని క్రమశిక్షణ పేరుమీద నిర్బంధం, చదువు లపేరుమీద బలవంతం చేయడం బాగుండదు. బలవంతపుచదువులను రుద్ది వాళ్ల అభిప్రాయాలకు, అభిరుచులకు భిన్నంగా పిల్లలను పుస్తకాల పురుగులుగా తయారుచేయడం వల్ల పిల్లల్లోని క్రియేటివిటీ దెబ్బతింటుంది. వాళ్లు మాట్లాడే బొమ్మలుగా టెక్స్ట్‌బుక్స్ తప్ప మరేం తెలీనివాళ్లుగా మారిపోతున్నారు.''

''అయితే మావాడేం చెయ్యాలని మీ ఉద్దేశం...?''

''మీ వాడికి లిటరేచరంటే ఇష్టం... డిగ్రీలో జాయిన్ చేస్తే అటు తర్వాత పి. జి. చేస్తాడు. కాంపిటీటివ్ పరీక్షల్లో పాసవుతే మంచి ఉద్యోగంలోనే స్థిరపడొచ్చు...''

''ఈ కాంపిటీషన్ యుగంలో అదంత సులభంగా సాధ్యమయ్యే పనికాదు. ఇంజనీరింగ్ చదివితే ఏ కాంపిటీషన్ టెస్ట్ రాయకున్నా కొంత ఆలస్యంగానైనా మంచి పదవిలో స్థిరపడొచ్చు. రేపేదో కాంపిటీటివ్ పరీక్ష రాసి మంచి పదవిలో స్థిరపడతాడని డిగ్రీలో జాయిన్‌చేశామనుకోండి. అది రాకుంటే తర్వాతేం చెయ్యాలి? రోడ్లు సర్వే చేయ్యడమేకదా'' రాఘవయ్య ముఖంలో భవిష్యత్తుపై ఆందోళనను చూశాడు వెంకట్రావు.

''మీ కొడుకు భవిష్యత్తు గూర్చి మీరు ఆందోళన పడటంలో విపరీతమేం లేదు. కాని, ఇంజనీర్ కానంత మాత్రాన బతకడం కష్టమనుకోవడం తప్పు. కాంపిటీటివ్ పరీక్షల్లో కాకుంటే ఏ లెక్చరర్‌గానో స్థిరపడతాడు. మరేదైనా ఉద్యోగం సంపాదించుకుంటాడు. కాదంటారా...?'' అన్నాడు వెంకట్రావు.

ఆ మాటలకు వ్యంగ్యంగా నవ్వాడు రాఘవయ్య.

''భలేవారండి మీరు. మీ శిష్యుడికి గొప్ప బుద్ధులే చెబుతున్నారు. మీలాగే చాలీచాలని జీతంతో ఎదుగూ బొదుగులేని బతుకు బతుకమంటారా? టీచర్‌గానో, గుమాస్తాగానో బ్రతికే కంటే అడుక్కు తినడం మేలు. భలేమాస్టారు దొరికారు. మంచి సలహాలే ఇస్తున్నారు...'' కొంచెం కోపంగా అన్నాడు.

ఆ మాటలకు వెంకట్రావు ముఖం మాడిపోయింది. ఇంటికి పిలిపించి మాస్టారును తండ్రితో మాటలనిపిస్తున్నందుకు మృత్యుంజయం బాధపడ్తున్నాడు. లోపల బాధగా వున్నాముఖంపై నవ్వు పులుముకొన్న వెంకట్రావు.

''మీ కొడుకును పెద్ద ఇంజనీర్ చేయాలని మీరు పడ్తున్న ఆరాటం బాగానే వుంది. కాని, నేను చెప్పేదొక్కటే. అతని అభిప్రాయాలకు కూడా కొంత విలువిమ్మని తర్వాత మీ ఇష్టం'' అన్నారు.

''మీ సలహాకు థ్యాంక్స్... మా బంధువులు, స్నేహితులు మంచి పొజిషన్లలో వున్నారు. మా అబ్బాయి బి.టెక్ చేసి ఉన్నత ఉద్యోగంలో వున్నాడు. అమ్మాయి మెడిసిన్ చేస్తోంది. వీణ్ణి డిగ్రీచేయించి ముష్టెత్తుకొమ్మనడం నాకిష్టం లేదు. అందరు మంచి పొజిషన్లల్లో వుంటే వీడు డిగ్రీ చదువుతున్నాడని చెప్పుకోవడం నాకవమానకరం. మా వాణ్ణి ఎంత కష్టమైనాసరే ఇంజనీర్ను చేస్తాను. వాడీ సంవత్సరం తప్ప కుండా బి.ఇ.లో జాయినవుతాడు. రేపే సిటీ తీసుకెళ్ళి మంచి కోచింగ్ సెంటర్లో జాయిన్ చేస్తాను. మావాణ్ణి గూర్చి మీరింత శ్రమ తీసుకున్నందుకు కృతజ్ఞతలు...'' అని లేచాడు రాఘవయ్య.

నాన్నా... నేను ఇంజనీరింగ్ చదువను. నాకా చదువొద్దు. అని గట్టిగా అరవాలనుకున్నాడు మృత్యుంజయం. కాని తననే సూటిగా చూస్తున్న తండ్రిని చూసి ఏం మాట్లాడలేపోయాడు.

''బెస్టాఫ్‌లక్...'' అంటూ లేచిపోయాడు వెంకట్రావు. మాస్టారుకు కాఫీ కూడా ఆఫర్ చెయ్యని తండ్రిని లోలోపలే తిట్టుకుంటూ ఇంట్లోకెళ్లాడు మృత్యుంజయం వద్దన్నా వినకుండా సిటీకి తీసుకెళ్ళి కోచింగ్ సెంటర్‌లో జాయిన్ చేశాడు రాఘవయ్య బాగా చదువాలని కొడుక్కు చెప్పాడు. సీటు రాకుంటే బాగుండదని హెచ్చరించాడు. మామూలు చదువుచదువుతే అడుక్కు తినాల్సి వస్తుందని బెదిరించాడు. ప్రొఫెషనల్ కోర్సు చదివితే తప్ప ఈ కాలంలో జీవితంలో స్థిరపడటం కష్టమన్నాడు. అన్నయ్య, అక్కయ్యలను ఆదర్శంగా తీసుకొమ్మన్నాడు. ఇంకెన్నో విధాలుగా చెప్పి వచ్చాడు. వారానికోసారి సిటీకెళ్ళి కొడుక్కు హెచ్చరికలు చేసి వస్తున్నాడు. మృత్యుంయం ఇంటలిజెంటే అయినా అతనికి ఇష్టంకాని చదువు చదవడం నచ్చడంలేదు, తండ్రి భయానికి ఎంట్రెన్స్‌కోసం చదువుతున్నాడు. చదువు... చదువు... చదువు నిర్విరామంగా చదువుతున్నాడు. కాని, మనస్ఫూర్తిగా చదివిన చదువు కాకపోవడంవల్ల, సీటు రావాలన్న పట్టుదలతో చదవకపోవడం వల్లెమ్‌సెట్ ఎంట్రెన్స్‌లో సక్సెస్ కాలేకపోయాడు. ఇంటర్‌లో ఇరవయ్యోరాంకు వచ్చిన మృత్యుజయంకు ఎమ్‌సెట్‌లో అయిదువేల లోపల రానేలేదు. సీటు రానందుకు అతడు విచారించలేదు. పైగా సంతోషించాడు. ఇప్పటికైనా హాయిగా డిగ్రీ చేసుకోవచ్చుననుకున్నాడు. తన కిష్టమైన చదువు చదువొచ్చున్నాడు ఆనందించాడు.

కాని రాఘవయ్య కొడుకును నోటికొచ్చినట్టు తిట్టాడు. విపరీతంగా కొట్టాడు కూడా.

''నాకడుపునచెడబుట్టావు. అన్నయ్య, అక్కయ్యను చూసైనా బుద్ధితెచ్చుకోలేదు. మొదట్నుంచీ నీవి లేకి బుద్ధులు. అలగా స్నేహాలే, అడుక్కుతిని బతుకు... వెధవా'' అని అందరి ముందు అవమానించాడు.

మృత్యుంజయం ఏడ్చాడు. అవమానభారంతో కుమిలి కుమిలి దు:ఖించాడు. రోజూ తండ్రి తిడ్తుంటే ఇంట్లో ఉండలేక అమ్మమ్మ ఊరికెళ్లిపోయాడు. కొద్దిరోజులండి తిరిగొచ్చి డిగ్రీలో చేరుతానన్నాడు. ఆ మాటలు విని ఉగ్రుడయ్యాడు రాఘవయ్య.

''నువ్వు డిగ్రీలో చేరాలన్న వెధవాలోచనలతోనే ఎమ్సెట్కోసం బాగాచదువలేదు. డిగ్రీ చదివి ముష్టెత్తుకోవడం నా కిష్టం లేదు. ఈ సంవత్సరం పోతే పోయింది. వచ్చే సంవత్సరం కోసం ఇప్పట్నుంచే ప్రిపేర్కా...'' అన్నాడు.

మృత్యుంజయం ఎంత మొత్తుకున్నా డిగ్రీలో చేరనివ్వలేదు. అన్ని నోట్స్ తెప్పించాడు. దగ్గరుండి చదివిస్తున్నాడు, బయటకు వెళ్లనివ్వకుండా చదివిస్తున్నాడు. రెండు మూడుసార్లు మృత్యుంజయం అమ్మమ్మ ఊరికి వెళితే వెంటనే పోయితీసుకొచ్చాడు రాఘవయ్య మిత్రులను కలుసుకోవడం కూడా కష్టమవుతోంది. మృత్యుంజయంకు చదువు చదవని వేధిస్తున్నాడు తండ్రి. ఇంకో రెణ్నెల్లలో మళ్లీ ఎమ్సెట్ ఎంట్రన్సుంది. మళ్లీ కోచింగ్కు పంపడానికి నిర్ణయించాడు రాఘవయ్య. రేపే మృత్యుంజయం హైదరాబాద్ ప్రయాణం.

★ ★ ★

గత జీవితాన్నంతా మననం చేసుకున్న మృత్యుంజయం కనుగుడ్లనిండా నీళ్లు. గత పదినెలలుగా అతనిపై హింస, మరింతెక్కువయింది. మంచంలో లేచి కూర్చున్నాడు మృత్యుంజయం.

తాను తలుచుకుంటే ఎమ్సెట్లో సీటు రావచ్చు. కాని తన కిష్టంలేని ఆ చదువు చదువలేడు. చదువకుంటే నాన్న ఊర్కోడు. తానీహింసను భరించలేడు. అవమానాలను ఎదుర్కోలేడు. తానీ లోకంలోంచి వెళ్లిపోవాలి...

లేచి నిల్చున్నాడు మృత్యుంజయం. టేబుల్పైనున్న ఎండ్రిన్ డబ్బా చేతిలోకి తీసుకున్నాడు. మూత తీశాడు. అందులోని విషాన్ని గటగటా తాగేశాడు. కడుపులో చెప్పలేనంత బాధ... కడుపులోని భాగాలను తినేస్తుంది విషం. బాధ కోర్చుకోలేక అరుస్తూ వాకిట్లో పడిపోయాడు. అరుస్తున్నాడు. బాధతో కేకలేస్తున్నాడు. కేకలు విని చుట్టు పక్కల వాళ్లురికొచ్చారు. విషయం తెలుసుకొని తలో దిక్కు ఉరికారు. కొద్ది సేపట్లో మృత్యుంయం మిత్రులంతా అక్కడకు చేరుకున్నారు. ఎవరుచెప్పారో ఏమో వెంకట్రావు మాస్టారు కూడా అక్కడికొచ్చాడు. మృత్యుంజయంను ఒడిలోకి తీసుకొన్నాడు. మరికొద్దిసేపట్లో రాఘవయ్య, అతని భార్య కూడా వచ్చారు. పరిస్థితి చూసి భోరున ఏడ్వసాగిందామె. కొడుకు దగ్గరకు పోబోయాడు రాఘవయ్య.

''డాడీ... నువ్వునా దగ్గరకు రావద్దు. నన్ను ముట్టుకోవద్దు. దూరంగా వుండు'' బాధతో మెలికలు తిరిగిపోతూ అన్నాడు మృత్యుంజయం. భోరు భోరున ఏడుస్తూ రాఘవయ్య అలాగే నిల్చున్నాడు. విషంకక్కించడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

''డాడీ? ఒక్కసారి నేను మిమ్మల్ని నాన్నా అని పిలువొచ్చా...? నేను పెద్ద ఇంజనీరవుతున్నాను

కదా? ఇప్పుడైనా పిలువనియ్యవా...?'' నోట్లోంచి తెల్లగా నురగొలొస్తుంటే ఒక్కొక్క మాట ప్రయత్నిస్తూ అన్నాడు మృత్యుంజయం.

అక్కడున్న వాళ్లంతా భోరుభోరున ఏడుస్తున్నాడు. చుట్టూ మిత్రులను కూర్చోబెట్టుకుని మాస్టారు ఒడిలో చివరిశ్వాస వదిలాడు మృత్యుంజయం.

ఘొల్లుమన్నారక్కడున్న వాళ్లంతా...

మహేందర్ కళ్లు అశ్రుభాండాలయ్యాయి. సుభాష్ కన్నీటివానలో తడిసి ముద్దయ్యాడు. జగన్, వేణు పోశెట్టి, మిగతామిత్రులంతా మృత్యుజయం ఎడబాటును భరించలేక భోరుభోరున దు:ఖిస్తున్నారు. వాళ్లంతా రాఘవయ్యనసహ్యంగా చూశారు. ఏడుస్తూ తలదించుకున్నాడతను.

''మీరే వాణ్ణి హత్య చేశారు. మీరు హంతకులు...'' హిస్టీరిక్‌గా అరిచాడు మహేందర్.

''మీ కొడుకు పెద్ద ఇంజనీరయ్యాడు. వాణ్ణెంతో హింసించారు. ఇప్పుడు మీ కళ్లు చల్లబడ్డాయా...?'' ఏడుస్తూ అన్నాడు సుభాష్.

రాఘవయ్యగారూ! ప్రతి తండ్రీ తనకొడుకు ఉన్నతస్థానానికెదగాలని కోరుకుంటాడు. అందులో తప్పులేదు. కాని పిల్లల అభిప్రాయాలకేమాత్రం విలువివ్వకుండా, వాళ్ల అభిరుచులను గమనించకుండా మన అభిప్రాయాలను రుద్దడం నేరం. క్రమశిక్షణ పేరుమీద ఇల్లునుజైలుగా మార్చడం. చదువు పేరుమీద పిల్లల్ని హింసించడం పెద్ద నేరం అనాలనుకున్నాడు వెంకట్రావు మాస్టారు. కాని కొడుకు వియోగంతో దు:ఖిస్తున్న రాఘవయ్యను చూసి అనలేకపోయాడు. కొడుకు శవంపైపడి మొత్తుకుంటున్న తల్లినాపడం ఎవరితరం కాలేదు. మాస్టారు కన్నకొడుకు పోయిందానికంటేక్కువ దు:ఖించాడు. మృత్యుంజయం అంతిమయాత్రలో అంతా పాల్గొన్నారు.

తనకు తలకొరివి పెట్టాల్సిన కొడుకు తనతో తలకొరివి పెట్టించుకుంటున్న దుస్థితికి రోదిస్తూ తనను తాను నిందించుకొంటూ మృత్యుంజయంచితికి నిప్పంటించాడు రాఘవయ్య.

పిల్లల అభిప్రాయాలకేమాత్రం విలువివ్వకుండా 'వాళ్లపై బలవంతపు చదువులను రుద్దుతున్న తల్లిదండ్రులను నిందించాలో?

సృజనాత్మకతకు దూరంచేసి పిల్లలను టాకింగ్ డాల్స్‌గా మారుస్తున్న చదువులను నిందించాలో?

ఎంత చదివినా బ్రతుకు భద్రత కల్పించని సమాజాన్ని నిందించాలో?

అర్థంకాక కన్నీరు కారుస్తూ మృత్యుంజయం చితిలో కట్టె వేసాడు వెంకట్రావు మాస్టారు.

శోకసముద్రంలో మునిగిన మృత్యుంజయం మిత్రులు అతనిచితిపై తలో కట్టెవేశారు.

అందరూ చూస్తుండగానే మృత్యుంజయం జ్వాలలుగా లేస్తున్న మంటల్లోమాడి, మసై పిడికెడు బూడిదగా మిగిలిపోయాడు.

*విపుల మాసపత్రిక అక్టోబర్ '91*